అర్హులకే సంక్షేమ పథకాలు



లబ్ధిదారురాలికి ఫించన్ సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

● ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం:

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పారదర్శకమైన పాలన అందిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల్ని అందిస్తున్నారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తెలిపారు. కొత్తగా పెన్షన్లు మంజూరైన 282 మంది లబ్ధిదారులకు మండల కేంద్రంలో మంగళవారం నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నవరత్నాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్నారని.. ఇచ్చిన హామీల్లో 98 శాతానికి పైగా నెరవేర్చారని తెలిపారు. ఇచ్చిన హామీలే కాక ప్రజా సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి లబ్ధిదారులకు అందజేస్తున్నారని చెప్పారు. అర్హతే ప్రామాణికంగా, కుల, మత, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాల్ని అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందన్నారు. పథకాల మంజూరుకు ఎవ్వరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పచ్చ దొంగలు పల్లెబాట పడుతున్నారని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి వారిని తరిమికొట్టి మళ్లీ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయినప్పుడే రాష్ట్రానికి దరిద్రం పట్టిందని.. ప్రస్తుతం సీఎం జగనన్న రాష్ట్రానికి పట్టిన దరిద్రాన్ని తొలగించి రాష్ట్రంలో సువర్ణ పాలన తీసుకువచ్చారని కొనియాడారు. విద్యా, వైద్య రంగాల్లో ఎన్నో అనూహ్య మార్పులను తీసుకువచ్చి గడప వద్దకే వైద్యాన్ని అందించడమే కాకుండా, రాష్ట్రంలో ప్రతి పేద విద్యార్థి చదువుకునేలా జగనన్న అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన వంటి గొప్ప పథకాలను ప్రవేశపెట్టి దేశంలోనే ఏపీ రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీలు దంతులూరి రావాడ బాబు, పడాల సత్యవతి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పాడ శివారెడ్డి, పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, మండల ప్రత్యేకాధికారి పద్మావతి, డీటీ శ్రీనివాసరావు, ఎంపీడీఓ దాసరి బంగారయ్య, ఏసీ రాజ్‌కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి



అపరాల పంటను పరిశీలిస్తున్న ఏడీఏ అన్నపూర్ణ

నెల్లిమర్ల: వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలను రైతులు పాటించాలని ఆ శాఖ విజయనగరం ఎ.డి రెడ్డి అన్నపూర్ణ సూచించారు. మండలంలోని మొయిద రైతుభరోసా కేంద్రాన్ని మంగళవారం సందర్శించిన ఆమె రాగి, అపరాల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాగి పంటకు అగ్గి తెగులు సోకుతోందన్నారు. దీని నివారణకు ట్రైసోక్లోజో అనే మందు ఎకరానికి 120 గ్రాములను సరిపడా నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే మొక్కజొన్నలో కత్తెరపురుగు నివారణకు ఇమామేక్టిన్ బెంజోయేట్ అనే మందు ఎకరానికి 80 గ్రాములు సరిపడా నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అనంతరం ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించిన అన్నపూర్ణ రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఏడీఏ వెంట ఏఓ పూర్ణిమ, ఏఈఓ నాగరాజు తదితరులున్నారు.

ప్రసార మాధ్యమాలది కీలకపాత్ర



లక్కీడిప్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న వన్‌టౌన్ సీఐ వెంకటరావు, ఐఎంఏ అధ్యక్షుడు జేసీ నాయుడు, తదితరులు

విజయనగరం టౌన్: ప్రసార మాధ్యమాలు సమాజంలో కీలకపాత్ర పోషించడంతో పాటు ప్రజలకు ఎప్పటికప్పుడు విషయ సమాచారాన్ని అందిస్తాయని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జేసీ నాయుడు పేర్కొన్నారు. వాజీ చానల్ ఆధ్వర్యంలో వాజీ యూట్యూబ్ సబ్‌స్క్రైబర్స్‌కి మంగళవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమాచారంతో పాటు నాణ్యమైన ప్రసారాలు, వినోదాత్మక కార్యక్రమాలు అందించడం అభినందనీయమన్నారు. అనంతరం వాజీ యూట్యూబ్ సబ్‌స్క్రైబర్స్‌కు లక్కీడిప్ తీసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వాజీ చానల్ ప్రతినిధులు సముద్రాల గురుప్రసాద్, కేఆర్‌కే రాజు, తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా సీతాకోకచిలుకల వనం



బోసిగా మారిన సీతాకోకచిలుక వనం

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లా అటవీశాఖ కార్యాలయ ప్రాంగణంలో మూడేళ్ల కిందట రూ.3.82 లక్షలతో సీతాకోక చిలుకల వనం ఏర్పాటు చేశారు. మొదట్లో నిర్వహణ సక్రమంగా ఉండడంతో చాలామంది సందర్శకులు వచ్చేవారు. అయితే కొన్నాళ్లుగా నిర్వహణ లేకపోవడంతో వనం అస్తవ్యస్తంగా మారింది. అందులో ఉన్న సీతాకోకచిలుకలు బయటకు పోయాయి. ఇప్పటికైనా అటవీ అధికారులు సీతాకోక వనంపై దృష్టి సారించాలని సందర్శకులు కోరుతున్నారు.

నేడు ప్రజాభిప్రాయ సేకరణ

పూసపాటిరేగ: మండలంలోని గుంపాం గ్రామంలో గల ఐవేక్స్ పరిశ్రమలో ఈ నెల 4వ తేదీన ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు పరిశ్రమ హెచ్‌ఆర్ మేనేజర్ సమీర్ పండా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.1.3 కోట్లతో ఆల్క్‌నైల్ సక్సినిక్ అన్‌హైడ్రైడ్ తయారీపై ప్రజాభిప్రాయ తెలుసుకోనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలందరూ హాజరై సూచనలు, సలహాలు తెలియజేయాలని కోరారు.

జీఓ 1 ఉపసంహరించుకోవాలి

విజయనగరం ఫూల్‌బాగ్: ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 1ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పి. కామేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ జీవో వెనక్కి తీసుకోకపోతే ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

విజయనగరం టౌన్:

నగరంలోని కొత్త అగ్రహారం రెండోవీధిలో ఉన్న ఎస్‌కేవీఎస్ దేవ స్థానం శివాలయంలో కొలువైన సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు భమిడిపాటి రమేష్ శర్మ (చిన్న పంతులు) ఆధ్వర్యంలో స్వామివారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. అనంతరం స్వామివారిని పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ ఈఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళులు

డెంకాడ:

మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఆదినారాయణ, అధ్యాపకులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళా హక్కుల కోసం సావిత్రిబాయి పూలే చేసిన పోరాటాన్ని, సాధించిన విజయాలను అధ్యాపకులు వివరించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



డెంకాడ:సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు

ముందుకు సాగాలి

విజయనగరం ఫూల్‌బాగ్: సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో ముందుకు సాగాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు గదుల వెంకటరావు పిలుపునిచ్చారు. స్థానిక కోరాడవీధిలోని సంఘ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి అప్పారావు, చోడి ఆదినారాయణ, ఉపాధ్యక్షులు ఆర్. రామారావు, ఎం. దుర్గారావు, సభ్యులు ఎస్ఎస్ రెడ్డి, కె. ఆచారి, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం గంటస్తంభం: సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సిబ్బంది

జెడ్పీ కార్యాలయంలో..

విజయనగరం గంటస్తంభం: జిల్లా పరిషత్ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి డిప్యూటీ సీఈఓ కె. రాజ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కో ఆర్డినేటర్ విజయకుమార్, విద్యాశాఖ కో ఆర్డినేటర్ డోల మన్మధకుమార్, చాంబర్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంటింటికీ కుళాయి పనులు ప్రారంభం



ఇంటింటికీ కుళాయి పనులను ప్రారంభిస్తున్న రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పాడ శివారెడ్డి

భోగాపురం: మండలంలోని అమటాం రావివలస పంచాయతీలో జల్‌జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ కుళాయి ఏర్పాటు పనులను రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్, సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నడుపూరి సత్యనారాయణ, నడుపూరి నరసింహనాయుడు, పువ్వల పైడిరాజు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బండారు సూరిబాబు, గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ



రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న సర్పంచ్ కర్రోతు వెంకటరమణ

భోగాపురం: మండలంలోని పోలిపల్లి పంచాయతీలో హుద్‌హుద్ కాలనీ నుంచి మంచినీటి బావి వరకు నిర్మించనున్న నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ కర్రోతు వెంకటరమణ మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంతవరకు రోడ్డు లేకపోవడం వల్ల గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి చొరవతో రోడ్డు సమస్య పరిష్కారమైందని తెలిపారు. మాజీ ఉపసర్పంచ్ పతివాడ రామకృష్ణ, హుద్‌హుద్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ సొమ్ము అందిస్తున్న వలంటీర్ సాయి

నెల్లిమర్ల: మండలంలోని సీతారామునిపేట గ్రామానికి చెందిన కింతాడ సన్యాసిరావుకు ఆరోగ్యం బాగోలేకపోవడంతో విజయనగరంలోని సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ సాయి ఏపీ టూరిజమ్ కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావుతో కలసి మంగళవారం ఆస్పత్రికి వెళ్లి పింఛన్ సొమ్ము 2,750 రూపాయలు అందజేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఏజీఎం దాలినాయుడు

విజయనగరం టౌన్: భారతీయ సంచార్ నిగమ్ లిమిటెడ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను బీఎస్ఎన్ఎల్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ దాలినాయుడు మంగళవారం కార్యాలయం ఆవరణలో ఆవిష్కరించారు. యూనియన్ అధ్యక్షుడు ఆలుగు వెంకటరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కోశాధికారి తామాడ కృష్ణకుమారి, సభ్యులు ఎంఎస్ఎన్ రాజు, రమణమ్మ, పద్మ, శకుంతల, అధికారులు ఎస్‌డీఈ గౌరీశంకర్, గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసునికి దీప సేవ



శ్రీనివాసునికి గుత్తిదీపాల సేవ నిర్వహిస్తున్న భక్తులు

విజయనగరం టౌన్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా స్థానిక బాబామెట్ట ఏడుకోవెళ్లలో కొలువైన వేంకటేశ్వరస్వామికి మంగళవారం గుత్తిదీపాల సేవను వేడుకగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కేపీపీ రాజు, కార్యదర్శి శివకుమార్, కోశాధికారి సాంబమూర్తిరాజు పర్యవేక్షణలో స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. అనంతరం భక్తులు స్వహస్తాలతో దీపారాధన చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో తిరుప్పావై విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తరించారు.

వాసవీ క్లబ్ సేవలు వెలకట్టలేనివి



వాసవీ క్లబ్ నూతన కార్యవర్గంతో డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

● డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: వాసవీ క్లబ్ చేస్తున్న సేవలు వెలకట్టలేనివని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. నగరంలోని ఉల్లివీధి ఆర్యవైశ్య భవనంలో మంగళవారం జరిగిన వాసవీ క్లబ్ 214 ఏ నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నూతన కార్యవర్గ సభ్యులు క్లబ్ ఖ్యాతిని మరింత ఇనుమడింపజేసే విధంగా కృషి చేయాలన్నారు. మరిన్ని ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టి స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఆకాంక్షించారు. మహిళలకు కుట్టు శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు లభించే విధంగా చూడాలన్నారు. క్లబ్‌లు చేపట్టే ప్రతి ప్రజాహిత కార్యక్రమానికి తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. క్లబ్ జిల్లా గవర్నర్ ఆత్మకూరు సతీష్, వి. జగన్ మోహనరావు, జిల్లా వైస్ గవర్నర్ ఆలవెల్లి వెంకటశేఖర్, తదితరులు మాట్లాడారు. నూతన క్లబ్ అధ్యక్షుడిగా కందుల సంతోష్, కార్యదర్శిగా సముద్రాల నాగరాజు, కోశాధికారిగా ఏవీఎస్ కుమార్, ఇతర నూతన క్లబ్ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

సామాజిక సమస్యలపై అవగాహన తప్పనిసరి

● రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి సత్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి సత్యం

విజయనగరం ఫోర్ట్: విద్యార్థులకు సామాజిక సమస్యలపై అవగాహన అవసరమని రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి పి. సత్యం అన్నారు. స్థానిక ఎంఆర్ కళాశాలలో యూత్ రెడ్‌క్రాస్ యూనిట్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ కార్యక్రమాలపై మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ నైతిక విలువలు కలిగి ఉండాలన్నారు. సభ్యులకు సొసైటీ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స, ప్రకృతి వైపరిత్యాల సమయంలో చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సాంబశివరావు, రెడ్‌క్రాస్ ఫీల్డ్ ఆఫీసర్ గౌరీశంకర్, విజయ్ భాస్కర్, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీల ప్రారంభోత్సవంలో క్రీడాకారులతో కలిసి ఎమ్మెల్యే కుమారులు మణిదీప్, ప్రదీప్, పీఏసీఎస్ అధ్యక్షుడు కనకసింహాచలం, తదితరులు

డెంకాడ: మండల కేంద్రంలో టోన్ ఫిట్‌నెస్ జిమ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కుమారులు బడ్డుకొండ మణిదీప్, ప్రదీప్ డెంకాడ పీఏసీఎస్ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలంతో కలిసి మంగళవారం ప్రారంభించారు.

ఈ పోటీల్లో నెల్లిమర్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి 40 జట్లు పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో పోటీలు నిర్వహిస్తున్నామని, విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రొంగలి కనక సింహాచలం, వైఎస్సార్‌సీపీ నాయకుడు గోపాలకృష్ణ, జిమ్ నిర్వాహకులు సూర్య, వాసు, నాని, తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలకు స్పందన



సారిపల్లి వైద్య శిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు

నెల్లిమర్ల: మండలంలోని సారిపల్లిలో సర్పంచ్ రాయి పైడమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు మజ్జి త్రివేణి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత దంత వైద్యశిబిరానికి మంచి స్పందన లభించింది. వైద్యులు మురపాల బాలాజీ, కోరాడ రవిచంద్ర, డి. సునీత 110 మందిని పరీక్షించి మందులు అందజేశారు. అవసరమైన వారిని శస్త్రచికిత్సలకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నడిపేన లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు నడిపేన ఆనంద్, సారిపల్లి గుర్నాథరావు, రాయి విభీషణరావు, తదితరులు పాల్గొన్నారు.

బొప్పడాంలో..

మండలంలోని బొప్పడాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరానికి బొప్పడాం, వల్లూరు, బుచ్చన్నపేట, తదితర గ్రామాల నుంచి సుమారు 150 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ మంచు కుమారస్వామి రోగులను పరీక్షించి మందులు అందజేశారు. అవసరమైన వారిని శస్త్రచికిత్సలకు రిఫర్ చేశారు. చౌడేశ్వరి దేవాంగ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో సర్పంచ్ అంబళ్ల కిరణ్ కుమార్, ఎంపీటీసీ సభ్యుడు బొంతు పురుషోత్తంనాయుడు, స్పెషల్ పీపీ మావూరి శంకరరావు, ఆల్తి శ్రీనివాసరావు, బొమ్మన రామారావు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలంటూ వినతి



వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘాల ప్రతినిధులు

నెల్లిమర్ల: మండలంలోని సారిపల్లి ఎస్సీ కాలనీలో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలని కోరుతూ దళిత బహుజన శ్రామిక యూనియన్, మాదిగ హక్కుల పోరాట సమితి, అంబేడ్కర్ ఇండియా మిషన్ ఆధ్వర్యంలో ఆ కాలనీకి చెందిన ప్రజలు పంచాయతీ కార్యదర్శి బి. భవానీకి మంగళవారం వినతి పత్రం అందజేశారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా కాలనీలోని ప్రతి ఇంటికీ కుళాయిలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. మాల, మాదిగ కులాలకు ప్రత్యేకంగా కమ్యూనిటీ హాల్ నిర్మించాలన్నారు. కాలనీలో పూర్తిస్థాయిలో సీసీ రహదారులు, కాలువలు నిర్మించాలని విన్నవించారు. వినతిపత్రం అందించిన వారిలో ఆయా సంఘాల ప్రతినిధులు రాయి ఈశ్వరరావు, ఎస్. రాజశేఖర్, ఎలక సంతోష్, తదితరులున్నారు.

దురుసుగా ప్రవర్తించొద్దు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ తిరుపతిరావు

విజయనగరం క్రైమ్:

జిల్లాలో సంక్రాంతి కానుకల పేరుతో డబ్బులు వసూలు చేసి మోసం చేసిన వ్యక్తులపై కేసులు నమోదయ్యాయని, బాధితులెవ్వరూ ఏజెంట్లపై దురుసుగా ప్రవర్తించ వద్దని రూరల్ సీఐ టీవీ తిరుపతిరావు తెలిపారు. కొండగుంపాం గ్రామంలో మంగళవారం సాయంత్రం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చట్టాన్ని ఎవరు తమ చేతుల్లోకి తీసుకోవద్దని, ఏజెంట్లపై దాడులు చేస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఏజెంట్లను చట్టపరంగా శిక్షిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.